

వాసంతి కుటుంబాన్ని ఆదుకుంటాం



● నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి ఫరూక్

● సమాజం తలదించుకునే ఘటన : బీసీ ● చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు ● రూ.10 లక్షల పరిహారం పంపిణీ

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 19: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ముచ్చుమర్రి ఘటనపై మంత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వాసంతి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన వాసంతి కుటుంబాన్ని శుక్రవారం మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 లక్షల పరిహారం చెక్కును చిన్నారి తల్లిదండ్రులు చిన్న మద్దిలేటి, సుజాతమ్మలకు అందజేశారు. మంత్రులతో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ జరగకూడని సంఘటన జరిగిందని, బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన వారు కూడా మైనర్లేనని వారి వెనుక వారి కుటుంబసభ్యులు ఉన్నారన్నారు. వారి వెనుక కూడా ఎంతటి పెద్దవారున్నా కఠినంగా శిక్షిస్తామన్నారు. మృతదేహం గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. సంఘటన జరిగిన మరుసటి రోజు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై ఆరా తీస్తున్నారని, మృతదేహం లభ్యమయ్యాక వచ్చి కుటుంబాన్ని పరామర్శిద్దామనుకున్నాం.. కానీ 13 రోజులైన మృతదేహం లభించకపోవడం దురదృష్టకరమన్నారు. నూతన ఎస్పీ ఈ కేసును విచారణ పూర్తి చేసి దోషులకు కఠినమైన శిక్ష పడేలా చేస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ఉన్న ఇద్దరు పిల్లలు జ్యోతి, మహేష్ బాబుల విద్యకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా కుటుంబ పోషణ కోసం చిన్నారి తల్లి సుజాతమ్మకు ఏదైనా ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ రాజకుమారిని ఆదేశించామన్నారు.

ట్యాబ్‌ల వల్లే యువత చెడిపోతుంది

గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లవల్లే విద్యార్థులు చెడిపోతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన శిక్షలు పడే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. వాటి హిస్టరీ చూస్తే విద్యార్థులు చూస్తున్న కంటెంట్ ఏమిటో అర్థమవుతోంది. విద్యార్థులను ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు, గంజాయికి జగన్ ప్రభుత్వం అలవాటు చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి అమ్మకానికి చెక్ పెట్టారన్నారు. వాసంతి మృతదేహం లభించేంత వరకు ఊరిలోనే ఉంటా. చిన్నారి కుటుంబానికి మా ప్రభుత్వం అండగా ఉంటుంది.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

యావత్ సమాజం తలవంచుకునే ఘటన

వాసంతి ఘటన యావత్ సమాజం తలవంచుకునే విధంగా ఉంది. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తే గత ఐదేళ్లలో గంజాయికి అలవాటు పడ్డ యువత తప్పుదోవ పట్టింది. చేసిన పాపాల నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా మరొకరు చేయాలంటే భయపడే విధంగా కఠినంగా శిక్ష పడేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారు. అత్యాచారం చేసి, హత్య చేయడమే కాకుండా మృతదేహాన్ని కూడా తల్లిదండ్రులు కనీసం కడచూపునకు నోచుకోకుండా చేసిన వారిని కఠినంగా శిక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తాం. ఘటన జరిగిన రోజు నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోంది.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి



వాసంతి తల్లిని ఓదార్చుత ఎన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు

గళమెత్తారు..

జడ్పీ సమావేశంలో వాణి వినిపించిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి జిల్లాకు కీలకమైన జడ్పీ సమావేశం శుక్రవారం జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన కర్నూలు జిల్లాలో జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చజరిగింది. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వాణి విపించారు.

గ్రామాల్లోకి వెళ్తేనే ప్రజల కన్నీటి కష్టాలు తెలుస్తాయి



పశ్చిమ ప్రాంతంలో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు గ్రామాల్లో తిరగండి.. అప్పుడే ప్రజల కన్నీటి కష్టాలు తెలుస్తాయి. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయం తక్షణమే పూర్తి చేయాలి. దేవమ్మ మడుగు కర్నూలు నగరం దాహం తీర్చింది. అక్కడ తుంగభద్ర నదిలో తెలంగాణ వాళ్లు ఇసుక తవ్వేస్తున్నారు. దేవమ్మ మడుగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

సుంకేశ్వరి తరహా సమస్య ఎక్కడా రాకూడదు



సుంకేశ్వరి గ్రామంలో తాగునీరు కలుషితం కావడంతో అతిసారం ప్రబలి ఎంతో మంది అస్వస్థతకు గురయ్యారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తారా..? తాగునీరు కలుషితమయ్యాయా..? ఏ గ్రామంలో కూడా ఇలాంటి పరిస్థితి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- టీజీ భరత్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి

గుండ్రేవులపై తెలంగాణకు లేఖ రాశారా..?



గుండ్రేవుల ఇంటర్‌స్టేట్ సమస్య అంటున్నారు. తెలంగాణకు ఏమైనా లేఖ రాశారా..? ఆ కారణంతో ప్రాజెక్టును పక్కన పెట్టడం భావ్యమా..? గాజులదిన్నె ప్రాజెక్టు మీటరు పెంచే పనులు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టరుకు రూ.35 కోట్లు బిల్లులు ఇవ్వలేదు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు, గేట్లు పెట్టలేదు. 3.5 టీఎంసీలు హంద్రీనీవా నీటిని కేటాయిస్తే ఐదేళ్లలో ఎందుకు తీసుకోలేదు.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

బస్సాపురం ఎస్ఎస్ ట్యాంక్ మరమ్మతులు చేయాలి



నియోజకవర్గంలో ఏడు సీపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నా తాగునీరు అందడం లేదు. బస్సాపురం ఎస్ఎస్ ట్యాంక్ గోడ కూలిపోయింది. తక్షణమే మరమ్మతులు చేయాలి. జల్‌జీవన్ మిషన్ పనులు 50 శాతం కూడా జరగలేదు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి. రైతు సేవా కేంద్రాల సేవలు రైతులు అందేలా చూడాలి.

- డాక్టర్ పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

ఆ పైపులైన్లు 30 ఏళ్ల క్రితం వేశారు



హాలహర్వి, హొళగుంద మండలాల్లో ఎస్ఎస్ ట్యాంకులు, పైపులైన్లు 30 ఏళ్ల క్రితం ఆనాటి జనాభాకు సరిపడేలా వేశారు. ఇప్పుడు జనాభా పెరిగింది. పైపులు లీకేజీలు వల్ల తాగునీరు అందడం లేదు. కొత్తగా పైపులైన్లు వేయాలి. జొహరాపురం వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించి హంద్రీనీవా నీటిని ఇస్తే తాగునీటి సమస్య తీరుతుంది.

- బి.విరుపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే


జీడీపీ నుంచి కోడుమూరుకు పైపులైన్ వేయాలి



కోడుమూరు తాగునీటి సమస్య తీర్చేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అధికారులు కొందరు వైసీపీ ముసుగు తొలగించుకోవడం లేదు. జి.సింగవరం నుంచి ఆర్.కొంతలపాడు వరకు ఇసుక తవ్వకాలు ఆపేయాలి. దేవమ్మ మడుగును రక్షించుకోవాలి

- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే

చెరువులు ఎందుకు నింపడం లేదు?



హంద్రీనీవా నుంచి 68 చెరువులకు కృష్ణా జలాలు నింపాలని గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేపట్టి 35 శాతం పూర్తి చేస్తే.. మిగిలిన పనులు ఎందుకు పూర్తి చేయలేదు. పైపులు లీకేజీలు వల్ల లక్ష్యం నెరవేడం లేదు. 35 చెరువులకు నీళ్లు నింపుతారా లేదా..?

- కేఈ శ్యాంబాబు, పత్తికొండ ఎమ్మెల్యే

నీటి సమస్యపై సమగ్ర నివేదిక తయారు చేయండి



ఆలూరు సహా వివిధ ప్రాంతాల్లో నీటి వనరులు ఉన్నా గ్రామాల్లో తాగునీరు అందడం లేదు. ఎందుకు ఈ సమస్య వస్తుంది. పాత స్కీంలు మెరుగు పరచడంతో పాటు కొత్తగా నీటి పథకాలు ఏర్పాటుకు అవసరమైన నివేదికలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఏ లోపాలు ఉన్నా ఎలా సరి చేయాలో సమగ్ర నివేదికలు ఇవ్వండి.

- పి.రంజిత్‌బాషా, కలెక్టరు, కర్నూలు

వివరాలు 7లో..

ఖరీఫ్ రైతులకు సాగునీరు

● ఎమ్మెల్యేలతో కలసి నియోజకవర్గాల వారిగా సమీక్షిస్తా-మంత్రి టీజీ భరత్

● ఐఏబీ సమావేశంలో తీర్మానం

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 19:: ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా రైతులకు సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో కలెక్టరు పి. రంజిత్ బాషా అధ్యక్షతన జిల్లా సాగు నీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నియోజకవర్గాలవారిగా ప్రాజెక్టుల స్థితిగతులపై త్వరలో ఎమ్మెల్యేలతో కలసి సమీక్ష నిర్వహించి.. అవసరమైన నిధుల కోసం సీఎం చంద్రబాబుకు నివేదికలు పంపిస్తామని అన్నారు. తుంగభద్ర జలాశయంలో 55.97 టీఎంసీలు వరద చేరడంతో ఎల్లెల్సీ కాలువ ఆయకట్టుకు సాగునీరు ఎప్పుడు ఇస్తారని రైతులు డిమాండ్ చేస్తుండడంతో.. ఐఏబీ సమావేశం నిర్వహించారు. సాగునీరు, వివిధ నీటి వనరుల మరమ్మతులు, నీటి లభ్యత తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ బి. రంజిత్‌బాషా మాట్లాడుతూ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని అన్నారు. 4-5 ఎకరాల్లో చిన్నపాటి చెరువులు తవ్వి సాగు, తాగునీటి సమస్య తీర్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ చెరువులు కబ్జాకు గురయ్యాయని, కబ్జాదారుల నుంచి చెరువులకు విముక్తి కల్పించాని అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ రిజర్వాయర్ పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మునగాల లిఫ్ట్ మరమ్మతులు చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కల్లూరు మండలంలో నాలుగు చెరువుకు హంద్రీనీవా నీటిని నింపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. ఇగిరేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లెల్సీ కింద ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సుంకేసుల గేట్లు మరమ్మతులు లేక తుప్పు పట్టాయని, మరమ్మతులు చేయాలంటే కర్నూలు నగరానికి తాగునీటి నిల్వ ఇబ్బందిగా మారిందని అన్నారు. హంద్రీనీవా ఎస్ఈ రాంగోపాల్ మాట్లాడుతూ ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి రూ.33 కోట్లు విద్యుత్తు బిల్లు వస్తుందని వివరించగా.. అది ప్రభుత్వం చూసుకుంటుందని మంత్రి టీజీ భరత్ వివరించారు. జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, అలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌పై నిఘా

● ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

● కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

● బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు, జూలై 19: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల మీద పటిష్ట నిఘా ఏర్పాట్లు చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఉదయం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఏఆర్ పోలీసు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డీఐజీకి ఆశీస్సులు అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు ఎస్పీ జి. బిందుమాధవ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కడప ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐజీ ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డీఐజీగా రాయలసీమకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

డీఐజీ గురించి: ● స్వగ్రామం - పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం

● 2009లో సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు

● అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, ఖాజీపేట పార్వతీపురం, వరంగల్, విజయనగరం జిల్లాలో ఓఎస్డీగా పని చేశారు. విశాఖపట్నం రూరల్ ఎస్పీగా, విజయవాడ సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీగా, కాకినాడ సీ-పోర్టు డైరెక్టర్‌గా, ప్రకాశం జిల్లా ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎస్పీగా, విశాఖపట్నం 16 బెటాలియన్ కమాండెంట్‌గా, ఆక్టోపస్, పోలీస్ ట్రాన్స్ ఆర్గనైజేషన్‌లలో ఎస్పీగా పని చేశారు.

● ఇటీవల జరిగిన రాష్ట్ర సాధారణ ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గ్రేహౌండ్స్‌లో డీఐజీగా పని చేస్తూ బదిలీపై కర్నూలు రేంజ్ డీఐజీగా ఆయన బాధ్యతలు చేపట్టారు.



డీఐజీకి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్



డీఐజీని కలిసిన నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

పరిష్కారాల్లేని సమీక్షలెందుకు?

● జడ్పీ సమీక్షా సమావేశంపై మంత్రి భరత్

● ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ స్కీమ్‌లకు మెయింటెనెన్స్ లేదు

● స్కీముల్లో స్కామ్‌లపై విచారణ జరిపిస్తాం- కేఈ శ్యామ్‌బాబు

● వైసీపీ హయాంలోలాగే అజెండా లేకుండా రమ్మంటున్నారు- గౌరుచరిత

కర్నూలు(అర్బన్), జూలై 19: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పరిష్కారాలేవీ లేనప్పుడు సమీక్ష వల్ల సమయం వృథా తప్ప ఒరిగేదేమీ లేదని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, గౌరుచరిత, బొగ్గుల దస్తగిరి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వై. నాగేశ్వరరావు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో కాలంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ స్కీమ్‌ల మెయింటెనెన్స్ కల్పించకపోవడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహంతో డ్యామ్‌లకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఐఏబీ సమావేశంలో తుంగభద్ర డ్యామ్ నుంచి 60 టీఎంసీ నీటిని విడుదల చేయాలని కర్నాటకను కోరేందుకు కలెక్టర్, అధికారులతో కలిసి వెళ్లాలని నిర్ణయిస్తామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు మాట్లాడుతూ 2017లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి జిల్లాలో 68 చెరువులు మంజూరు చేయించి 70 శాతం పనులు పూర్తిచేయించారని, వైసీపీ ప్రభుత్వంలో ఆ పనులు అక్కడే నిలిచిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పనులు చేయకపోగా ఆర్‌డబ్ల్యూస్ స్కీమ్‌లు అన్ని డిఫాల్ట్ అయ్యాయని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. అయితే నిర్మాణాలు జరిగినట్లు చూపి నిధులు కాజేశారని అన్నారు. దీనిపై విచారణ జరిపించి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ హంద్రీ నీవా ద్వారా నీటిని ఓర్వకల్లు మండలానికి మళ్లించాలని, ఇరిగేషన్‌పై నంద్యాల, కర్నూలు జిల్లాల అధికారులు సంయుక్తంగా పని చేసి పాణ్యం నియోజవర్గంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, వేదవతి తదితర పనులకు సంబంధించి ఒక రెఫరెండమ్‌తో చంద్రబాబును కలిసి నివేదిస్తామని అన్నారు. డీఎంఆర్డీ క్రిష్ణా రివర్స్ బోర్డులను కర్నూలులో ఏర్పాటు చేసేందుకు కోరదామన్నారు. ఈ సమావేశంలో షేక్షావలి, హనుమంతరావుచౌదరి, బేతం క్రిష్ణుడు, ఎల్లప్ప పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

జల్ జీవన్ అక్రమాలు నిగ్గుతేల్చండి





వేదికపై ఆశీనులైన మంత్రులు, అధికారులు

- వాడివేడిగా సాగిన జడ్పీ సర్వసభ్య సమావేశం
- కాకి లెక్కలు చెబుతున్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఆగ్రహం
- సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపణ
- కర్నూలులోనే కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానం
- గుండ్రేవుల జలాశయం నిర్మించాలి..
- హాజరైన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారథి, బి.విరూపాక్షి

కర్నూలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు (న్యూసిటీ): జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై సమగ్ర విచారణ చేసి అవినీతి అక్రమాలపై నిగ్గుతేల్చాలని, గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్లు వాస్తవాలు దాచిపెట్టి కాకిలెక్కలు చెబుతున్నారని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. శుక్రవారం జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో తాగునీరు.. సాగునీటి ప్రాజెక్టు పనులపై గరం.. గరంగా చర్చ సాగింది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, పి.రాజకుమారి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, గౌరు చరిత, గిత్తా జయసూర్య, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. వ్యవసాయం, గ్రామీణ తాగునీటి సరఫరా, ఇరిగేషన్, విద్యుత్ శాఖల పనితీరుపై ప్రధానంగా చర్చ జరిగింది. సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక అధికారులు నీళ్లు నమిలారు. కలెక్టరు రంజిత్‌బాషా జోక్యం చేసుకొని సమాధానం చెప్పాల్సి వచ్చింది.

జల్‌జీవన్ మిషన్ అక్రమాలపై విచారణ జరపాలి

జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) కింద ఇంటింటికి కుళాయి ఇవ్వడానికి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.313.56 కోట్లు మంజూరు చేసి 1,548 పనులు మంజూరు చేస్తే.. 881 పనులు చేపట్టి 525 పనులు పూర్తి చేశామని, 231 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 90 శాతం పరోగతి సాధించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు వివరించగా ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లు తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఈ పనుల్లో భారీ అక్రమాలు జరిగాయని అన్నారు. దీనిపై విచారణ చేసి అవినీతిపరుల నిగ్గుతేల్చాలని ఎంపీ బైరెడ్డి డిమాండ్ చేశారు. జేజేఎం పనులు మేజరు పంచాయతీ గోనెగండ్లలో ఏ స్థాయిలో ఉన్నాయో చేశారా..? అని ఎమ్మెల్యే బీవీ నిలదీశారు. వైసీపీ ప్రభుత్వంలో నిధుల స్వాహాపై విచారణ జరపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత డిమాండ్ చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జోక్యం చేసుకొని జేజేఎం పనుల్లో 90 శాతం ఇదే పరిస్థితి ఉందన్నారు. సమగ్ర విచారణ చేసి అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను మంత్రి బీసీ ఆదేశించారు.

జడ్పీ స్థాయి సంఘాలలో ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: జిల్లా పరిషత్ స్థాయి సంఘాలలో నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశభవనంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో జడ్పీటీసీలు స్థాయి సంఘాల సభ్యులను ఎన్నుకున్నారు. మొత్తం 7 స్థాయి సంఘాలు ఉంటాయి. 1వ స్థాయి సంఘం(ఆర్థికఅండ్ ప్రణాళిక)లో ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎన్ఎండీ. ఫరూక్, 2వ స్థాయి సంఘం(గ్రామీణాభివృద్ధి)లో డా. బైరెడ్డి శబరి, డా. పార్థసారథి, 3వ స్థాయి సంఘం(వ్యవసాయం)లో జయనాగేశ్వరరెడ్డి, 4వ స్థాయి సంఘం(విద్య, వైద్యం)లో బస్తిపాటి నాగరాజు, బొగ్గుల దస్తగిరి, 5వ స్థాయి సంఘం(మహిళా సంక్షేమం, పరిరక్షణ)లో కేఈ. శ్యాంబాబు, బి. వీరుపాక్షి, 6వ స్థాయి సంఘంలో జి. జయసూర్య, వై. బాలనాగిరెడ్డి, 7వ స్థాయి సంఘంలో భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, బీసీ. జనార్దన్‌రెడ్డి ఉంటారు.

పల్లెసీమల్లో కన్నీటి కష్టాలు తీరవా..?

చెంతనే తుంగభద్ర నది ఉన్నా కన్నీళ్లు తీరవా? అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు నిలదీశారు. కోడుమూరు పట్టణంలో వారానికి ఒకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. గాజులదిన్నె నుంచి పైపులైన్ వేయాలని ఎమ్మెల్యే బొగ్గల దస్తగిరి, రిజర్వాయర్ పక్కనే ఉన్నా.. వెలుగోడుకు తాగునీరు అందడం లేదని ఎంపీ బైరెడ్డి శబరి ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు 3.5 టీఎంసీలు కేటాయిస్తే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆలూరు నియోజకవర్గంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు పైపులైన్ల వల్ల గ్రామాల్లో తాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. ఆదోని మండలం బస్సాపురం ఎస్ఎస్ ట్యాంక్ ఓ వైపు బండ్ కూలిపోయిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు.

పట్టిసీమ ద్వారా సీమ సస్యశ్యామలం

నదులు అనుసంధానంలో గత టీడీపీ ప్రభుత్వంలో పట్టిసీమ లిఫ్ట్ చేపడితే ఇదే సభలో గత వైసీపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పట్టిసీమ వేస్ట్ అన్నారని, ఇంతకూ పట్టిసీమ ద్వారా సీమకు ప్రయోజనం ఉందా.. లేదా..? చెప్పాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమండ్ చేశారు. సమాధానం చెప్పేందుకు నీళ్లు నమిలిన ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి చివరకు సీమకు ప్రయోజనమే అని పేర్కొన్నారు. గుండ్రేవుల నిర్మాణంపై తెలంగాణకు ఏమైనా లేఖ రాశారా..? బీవీ ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులకు ఆదాయం కోసమే జీఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు చేపట్టారా? అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిలదీశారు. హంద్రీనీవా విస్తరణ, అలగనూరు రిజర్వాయర్ టెండర్ల రికార్డులు కావాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కోరారు.



ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్యేలు గౌరు చరిత, బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, కేఈ శ్యాంబాబు, దస్తగిరి, హాజరైన సభ్యులు

తీర్మానాలు ఇవి

- కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని కృష్ణా బేసిన్‌కు ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నానికి గత వైసీపీ ప్రభుత్వం తరలించిందని, దాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని కోడుమూరు, ఎమ్మిగనూరు బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరెడ్డి ప్రతిపాదించగా.. జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.
- గుండ్రేవుల జలాశయం నిర్మాణం గురించి ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత డిమాండ్ చేశారు. జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తీర్మానం ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు.
- **మంచినీటి పథకాలకు రూ.85 కోట్లు ఇవ్వాలి:** గ్రామీణ సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్ స్కీంలు) నిర్వహణ జడ్పీకి భారంగా మారింది. ఏడాదికి రూ.80-85 ఖర్చు అవుతుంటే.. ప్రభుత్వం ఇచ్చేది రూ.23 కోట్లే.. రూ.85 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి కోరుతూ తీర్మానం చేశారు.
- **పర్యాటకానికి జడ్పీ పాత భవనం:** జిల్లా పరిషత్తు (జడ్పీ) పాత భవనాన్ని ఏపీ పర్యాటక శాఖ (టూరిజం)కు చదరపు అడుగు నిర్మాణ ప్రాంతం రూ.15, ఖాళీ స్థలం రూ7.50లకు లీజుకు ఇచ్చేలా తీర్మానం చేశారు.




వేదికపై జడ్పీ చైర్మన్, మంత్రులు, కలెక్టర్లు

రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌గా బాలునాయక్

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: కార్మిక శాఖ రాయలసీమ జోన్ రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌గా బాలునాయక్‌ను నియమిస్తూ కార్మిక శాఖ కమిషనర్ ఎంవి. శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన బాలునాయక్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. 1995 ఆత్మకూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా, 2000 నుంచి 2005 వరకు కడప ఏఎల్ఓ-2గా, 2005 నుంచి 2011 వరకు పుత్తూరు ఏఎల్ఓగా, 2011 నుంచి 2016 వరకు మదనపల్లి అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా, 2016 నుంచి 2019 వరకు రాజంపేట్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ కర్నూలు కార్మిక శాఖ ఉపకమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి చిత్తూరు ఏసీఎల్‌గా, 2020 నుంచి 2022 వరకు తిరుపతి డీసీఎల్‌గా ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. 2021లో ఉప కమిషనర్‌గా పదోన్నతి పొంది ఇప్పటి వరకు తిరుపతిలో పని చేస్తున్నారు. అదే విధంగా 2022 నుంచి రాయలసీమ జోన్ ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలునాయక్‌కు రెగ్యులర్‌గా పదోన్నతి కల్పించారు.

కోసిగిలో రెండు చిరుతలు



కోసిగి తిమ్మప్పకొండలో కనిపిస్తున్న చిరుత పులులు

కోసిగి, జూలై 19: కోసిగి సమీపంలో మరోసారి రెండు చిరుత పులులు తిరిగాయని గ్రామస్థులు ఆందోళన చెందుతురు. గ్రామ సమీపంలోని తిమ్మప్పకొండ చిరుత పులులకు అడ్డాగా మారింది. గత మూడేళ్లుగా ఈ కొండపై చిరుత పులులు స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి. శుక్రవారం సాయంత్రం విద్యుత్ సబ్‌స్టేషన్, కేజీబీవీ పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న తిమ్మప్ప కొండ నుంచి రెండు చిరుత పులులు వర్షానికి బయట రావడం స్థానిక కాలనీ ప్రజలు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు చూసి భయాందోళనలకు గురయ్యారు. రాత్రి వేళల్లో భయంగా ఉందని విద్యార్థినులు, ఉపాధ్యాయులు అన్నారు. చిరుత పులులను చూసి కొండలో ఉన్న కోతులు ఒక్కసారిగా గ్రామంలోకి వచ్చి అరవడం మొదలు పెట్టాయి. సుమారు గంటపాటు చిరుత పులులు కొండ రాళ్ల మధ్య తచ్చాడాయి. ఫారెస్టు అధికారులు కొండపై ఉన్న చిరుత పులులను బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉర్దూ వర్సిటీ వీసీగా షావలీఖాన్

కర్నూలు(అర్బన్), జూలై 19: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతిగా ప్రొఫెసర్ పీఎస్ షావలీఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీలో బాటనీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు, ప్రిన్సిపల్ ఎం.జహనరా, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రం లభ్యం

తుగ్గలి, జూలై 19: వ్యవసాయ పనులు చేసుకుంటున్న కూలీకి వజ్రం దొరికింది. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరిలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న కూలీకి వజ్రం లభ్యం కావడంతో స్థానిక వజ్రాల వ్యాపారి రూ.1.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తుగ్గలి, జూలై 19: సాగు చేసిన పంటలకు దిగుబడి లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి కడివెల్ల రాముడు (44) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో కడివెల్ల రాముడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చి వాంతులు చేసుకుంటుండటంతో గమనించిన భార్య కడివెల్ల రాణి పత్తికొండ వైద్యశాలకు తరలించింది. ఆ తర్వాత కర్నూలు వైద్యశలకు తీసికెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ గొర్రెలు మేపుకుంటూ రాముడు జీవనం సాగిస్తుండేవాడు. పంటలు కలిసిరాకపోవడంతో దాదాపు రూ.6 లక్షల మేర అప్పులు అయ్యాయని భార్య తెలిపింది. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కలిసి చర్చించుకుందాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 19: పార్టీలో అంతర్గత విభేదాలు ఉంటే కలిసి చర్చించుకుందామని, పార్టీ ఆదేశాలను ఎవ్వరూ ధిక్కరించడానికి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీకార్యాలయంలో ఆలూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆలూరు సీనియర్ నాయకులు వీరభద్రగౌడ్ తమను కలుపుకు పోవడం లేదని ఆరోపించారు. స్పందించిన తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఇన్‌చార్జీలను నియమించలేదని, పార్టీకి చెందిన మండల నాయకులను కూడా తొలగించలేదని, అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, నాయకులు విజయభాస్కరగౌడ్, అశోక్, రజని, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

32,673 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జూలై 19: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో నమోదయింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 32,673 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 808.40 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీ లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 33.3895 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. జలాశయం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆదోని రూరల్, జూలై 19 : ఎమ్మిగనూరు 11వ వార్డుకు చెందిన బోయ పెద్దయ్య, సుధ దంపతుల కుమారుడు ఉదయ్(20) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దయ్య దంపతులు బెంగుళూరుకు వలస వెళ్లి అక్కడ గౌండ పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఉదయ్, కిశోర్ సంతానం. పెద్ద కొడుకు ఉదయ్ తల్లిదండ్రుల వద్ద ఉంటూ టైల్స్ దుకాణంలో పనిచేస్తూ ఎమ్మిగనూరులోని ఓ కళాశాలలో ఒపెన్ డిగ్రీ చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఉదయ్‌కి బెంగుళూరులోని ఎయిర్‌పోర్టులో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు రావాలని కబురు వచ్చింది. దీంతో ఎమ్మిగనూరుకెళ్ళి 18వ తేదీన పుట్టిన రోజు వేడుక చేసుకొని, కాలేజీలో సర్టిఫికెట్లు తీసుకొని వస్తానని ఈనెల 16న ఉదయ్ స్వగ్రామానికి వచ్చాడు. 18న గురువారం ఉదయం స్నేహితుడు మునితో కలిసి ద్విచక్ర వాహనంపై ఎమ్మిగనూరు నుంచి ఆదోనిలో ఉన్న అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాడు. స్నేహితులు ఎమ్మిగనూరులో పుట్టినరోజు కేక్ కట్ చేయడానికి సన్నాహాలు చేశారు. ఆదోనిలోని అమ్మమ్మ ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని తీసుకొని వేర్వేరుగా స్నేహితుడు ముని, ఉదయ్ ఎమ్మిగనూరు బయల్దేరారు. ఆదోని మండలం నాగలాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఉదయ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్నేహితుడు ముని ఆదోని ఆసుపత్రికి చేర్చాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా, ఎమ్మిగనూరు సమీపంలో ఉదయ్ కన్నుమూశాడు. పుట్టిన రోజు నాడే కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బెంగుళూరులో ఉన్న తల్లిదండ్రులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్పీ ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఆరుగురు పోలీసుల బదిలీ

కర్నూలు, జూలై 19: నగరంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు పోలీసులపై ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ బదిలీ వేటు వేశారు. ఇటీవల కాలంలో వీటిపై ఆరోపణలు రావడంతో విచారించిన ఎస్పీ నిజమని తేలడంతో వారిని శుక్రవారం ఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. వారికి కార్యాలయంలో గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చి మద్దికెర, హోళగుంద, చిప్పగిరి ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో తాలుకా పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ భాస్కర్‌రాజు, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, కానిస్టేబుల్ ప్రసాద్, నాలుగు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గోవిందు, కానిస్టేబుల్ నాయక్‌లు ఉన్నారు.

జీడీపీని సందర్శించిన ఐఆర్ఎస్ అధికారులు

గోనెగండ్ల, జూలై 19: జిల్లా ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు గాజులదిన్నె ప్రాజెక్టును శుక్రవారం ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి చింతరంజన్‌దాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ప్రాజెక్టులో ఎంత నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు కింద ఎన్నివేల ఎకరాలు సాగు కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఎన్నివేల ఎకరాల్లో సాగు అవుతున్నది. ఏ సీజన్‌లో రైతులకు నీరు అందజేస్తున్నదీ ప్రాజెక్టు అధికారులు డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ అలీని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం ప్రాజెక్టులో ఆరు క్రష్ట గేట్‌లకు గాను మూడు గేట్‌ల పనులు పూర్తి అయ్యాయి. మిగతా మూడు గేట్ల పనులు త్వరలో పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సోనిబాయి, ఏవో హేమలత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోయిన వైసీపీ నాయకులు

- నమాజు చేస్తున్న యువకులపై దాడి
- ఇద్దరికీ తీవ్ర గాయాలు



చేతిలో గొడ్డలి పట్టుకున్న వైసీపీ నాయకుడు

కోసిగి, జూలై 19: మండలంలోని సాతనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మసీదులో నమాజు చేస్తున్న ముస్లిం యువకులు నజీర్, నవాజ్‌లపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముల్ల కాశీం, అతని కుమారులు ఖాజా, రెహిమత్ వలి, జిలాన్, అబ్దుల్ కర్రలతో దాడులు చేసి గొడ్డలితో చంపుతామని బెదిరించారు. నమాజు చేస్తున్న తమపై దాడి చేశారని నజీర్, నవాజ్ తెలిపారు. తీవ్ర రక్తగాయాలైన యువకులను మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. గ్రామంలోని దర్గాని ఇనామీ వక్ఫ్‌బోర్డు భూములను తాము నెల రోజుల కిందట నజీర్, నవాజ్ జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారుల సమక్షంలో వేలం పాటలో దక్కించుకోవడం జీర్ణించుకోలేని వైసీపీ ముస్లిం నాయకులు దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై ఎస్ఐ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

» రైతుల్లో ఆనందం » వాగులు, వంకలకు జలకళ

ఓర్వకల్లు, జూలై 19: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఎండుతున్న పంటలకు ప్రాణం పోసింది. ఈ వర్షం రాకతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌లో కురిసిన వర్షానికి రైతులు పొలాల్లో విత్తనాలు విత్తారు. నెల రోజులైనా వరుణదేవుడు కరుణించకపోవడంతో వేసిన పంటలన్నీ వాడుముఖం పట్టడంతో రైతులు దిగాలు చెందారు. వరుణదేవుడు కరుణించవయ్యా అంటూ రైతులు మొక్కుకున్నారు. మండలంలో ఓర్వకల్లు, హుడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, మీదిమే ముల, ఉయ్యాలవాడ, హుశేనాపురం, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, కాల్వ, తదితర గ్రామాల్లో పత్తి 3250 హెక్టార్లులో, కంది 300 హెక్టార్లులో, మొక్క జొన్న 1241 హెక్టార్లులో వేరుశనగ 115, కొర్ర, 150, పొద్దుతిరుగుడు 20 హెక్టార్లలో, ఉల్లి 400 హెక్టార్లలో వివిధ పంటలు 500 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. సరైన వర్షాలు లేక పంటలు వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని దిగాలు చెందారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెరువులు, కుంటలు,


కోడుమూరు మండలంలో కళకళలాడుతున్న ఉల్లి పైరు


ఓర్వకల్లులో పొంగిపొర్లుతున్న కుందూ వాగు

వాగులు నీటితో కళకళలాడుతున్నాయి.

కోడుమూరులో భారీ వర్షం

కోడుమూరు(రూరల్): మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావం కారణంగా మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వర్షం కురిసింది. ఖరీఫ్ ప్రారంభంలో మంచి వర్షాలు కురవడంతో రైతులు విత్తన పనులు ముమ్మరం చేశారు. అయితే తర్వాత వరుణుడు ముఖం చాటే యడంతో పైరులు బెట్ట పరిస్థితికి చేరుకున్నాయి. అల్పపీడనంతో భారీవర్షం రావడంతో పంటలకు జీవం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

గూడూరు: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత పది పదహైదు రోజులుగా వర్షం లేక వేసిన పైర్లు ఎండుముఖం పట్టడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. అయితే గురువారం ఉదయం చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో వేసిన పైర్లకు ప్రాణం వచ్చినట్లు ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. గూడూరు మండలంలో సాధారణ విస్తీర్ణం తొమ్మిది వేల ఐదు వందల హెక్టార్లు కాగా, ఇప్పటివరకు సాగు అయిన విస్తీర్ణం నాలుగు వేల రెండు వందల హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం: ఎంపీ


నోట్ పుస్తకాలు, బ్యాగును పంపిణీ చేస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం కేవీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లను ఎంపీ నాగరాజు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జూని యర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భో జన పథకాన్ని ప్రవేశ పెడు తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ లాలెప్ప మాట్లాడుతూ కళాశాల సమస్యల పరిష్కారానికి ఎంపీ నాగరాజు అందిస్తున్న తోడ్పాటు అమోఘమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టౌన్ మోడల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 19: స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ప్రిన్సిపల్ సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో ఎంతో మంది విద్యనభ్యసించి రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, అందులో టీజీ భరత్ ఒకరు అని అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఎంపీ నాగరాజు, ఆర్‌ఐవో గురువయ్యశెట్టి, ప్రిన్సిపాల్ సుంకన్నలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు అత్తాపూరు రహమాన్, గంగాధర్, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పుల్లయ్య కళాశాలలో ఇండోనేషియన్ సెంటర్ టెక్నాలజికల్ మీట్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 19: పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఇండోనేషియన్ సెంటర్ టెక్నాలజికల్ మీట్ జరిగింది. సాంకేతికత బదిలీకి సంబంధించి హెచ్‌ఈఐ కల్పించడానికి ఏఐసీటీఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాయలసీమలో 35 కళాశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని తమ వద్ద ఉన్న ఆలోచనలను పంచుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, ఎస్. అబ్దుల్ బాషా, లెక్చరర్లు, పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్), జూలై 19: పారా మెడికల్ కోర్సుల కోసం ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు www.appmb.co.in/appahpc.co.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఇంటర్ బైపీసీ చెందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆ తర్వాత మిగిలిన గ్రూపులు చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను రుసుం రూ.100 చెల్లించి ఆగస్టు 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కర్నూలు మెడికల్ కాలేజీలో అందజేయాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కోడుమూరు(రూరల్), జూలై 19: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 నోటు పుస్తకాల చొప్పున అందించినట్లు తెలిపారు.





ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీకి సన్మానం


ఎన్‌టీకే నాయక్‌ను సన్మానిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 19: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీ చేయాలని, నూతన కోర్సులు ఏర్పాటు చేయాలని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిధులు కేటాయిం చేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా విశ్వవిద్యాలయంలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యార్థి నాయకులు భాస్కర్, మద్దిలేటి, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, అంబే ద్కర్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు మధు కృష్ణ, విశ్వవిద్యాలయ టీఎస్ ఎఫ్ నాయకుడు యువరాజ్ పాల్గొన్నారు.

ఆగమ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), జూలై 19: ఆగమ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని ఎడిషనల్ కమిషనర్, కంట్రోలర్ ఆఫ్ ఆగమ ఎగ్జామినేషన్ కే. రామచంద్రమోహన్ ఒక ప్రకటనలో కోరారు. వైదిక స్మార్త, శైవ, పాంచరాత్ర, వైఖానస, తంత్రసారా, వీరశైవ, చాత్తాద, శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. వివరాలకు 08645-273139, 630207 1530 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఉమాపతి ఆదేశం

కల్లూరు, జూలై 19: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి సూచించారు. శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. ఈమేరకు విద్యుత్‌శాఖ అధికారులు సంబంధిత హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉండాలన్నారు. వర్షాకాలంలో వినియోగదారులు, రైతులు ప్రమాదాలు బారిన పడకుండా అధికారులు అవగాహన కల్పించాలని సేఫ్టీ ప్రికాషన్స్‌పై అధికారులకు ఇచ్చిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేయాలని తెలిపారు.

● **కల్లూరు, కర్నూలు మండలాల్లో నేడు విద్యుత్ కోత:** కల్లూరు, కర్నూలు మండలాల్లో విద్యుత్ మరమ్మతులు, నూతన లైన్ పనులు జరుతున్న నేపథ్యంలో కరెంట్ కోత ఉంటుందని కర్నూలు రూరల్ ఏడీఈ సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 2 వరకు చిన్నటేకూరు, మిలటరీకాలనీ 33-11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో కరెంట్ కోత ఉంటుందని ఆయన తెలిపారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 19: ప్రభుత్వ హాస్టల్‌లో పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు హాస్టల్‌లో నిద్ర చేస్తామన్నారు. డిగ్రీ, ఆన్‌లైన్ అడ్మిషన్‌తో విద్యార్థులు కోరుకున్న కళాశాలల్లో సీట్లు పొందలేక పోతున్నారన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో. నెం.77ను రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నవనీత్, అర్జున్, వర్ధన్ పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

ఓర్వకల్లు, జూలై 19: మండలంలోని సోమయాజులపల్లె రహదారిపై వెలసిన రామరామేశ్వర షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి మహాభిషేకం, అష్టో త్తరం, గురుపూజ, కాగడ, సంధ్యా హారతిలు, పల్లకిసేవ 'సయనిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే మండలంలోని కాల్వబుగ్గ గ్రామ సమీపంలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు శివసాయి గురూజీ తెలిపారు.

సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: ఈ నెల 21న జరగనున్న బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. శుక్రవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడి కార్మికుల సమస్యలను చర్చిండానికి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ నగరంలో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్. సాయిబాబా, కే.సుధాకరప్ప పాల్గొన్నారు.

● ఈనెల 23న సీపీఐ జిల్లా కార్యవర్గం, 24న సర్వసభ్య సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బిగిడ్డయ్య ఒక ప్రకటనలో కోరారు. కార్యవర్గ సమావేశాన్ని సీఆర్ భవన్‌లో, సర్వసభ్యసమావేశాన్ని లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశాలకు రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.రామచంద్రయ్య హాజరవుతున్నారన్నారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

కర్నూలు(లీగల్), జూలై 19: సీనియర్ న్యాయవాది కే.సత్యనారాయణ రావు (94) మృతికి కర్నూలు జిల్లా న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. శుక్రవారం జిల్లా కోర్టు హాలులో జరిగిన ఓ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది సత్యనారాయణ రావు 50 ఏళ్ల పాటు న్యాయవాదిగా పలు సివిల్ కేసుల్లో వాదించి మంచి పేరు గడించారని కొనియాడారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఆ తర్వాత రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కోర్టు విధులను కూడా ఒక గంటపాటు ఆలస్యంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రధా న న్యాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పాలూరి రవి గువేరా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ ఆపండి: ఆప్టా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 19: గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేసిందని, అయితే విద్యార్థులు వాటిని దుర్వినియోగం చేసుకున్నారని, ఇప్పటి నుంచి బైజూస్ ట్యాబ్ల్ పంపిణీ నిలిపివేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసి యేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కేజీఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్‌రావు శుక్రవారం మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను విద్య పాఠ్యాంశాలకు కాకుండా ఇతర కార్యకలాపాలకు వాడుకుంటూ చెడు మార్గాన పడుతున్నారన్నారు. రాత్రి సమయాల్లో నిద్రపోకుండా ట్యాబ్‌ల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నట్లు దానిపై మానసిక శారీరక, ఆరోగ్యం దెబ్బతింటుందని, తమ పిల్లలను ఆపలేకపోతున్నామని తల్లిదండ్రులే ఉపా ధ్యాయులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా చెడుమార్గం పట్టి నైతిక విలువలు కోల్పోకముందే ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని కోరారు.

విద్యుత్ మోటార్ల దగ్గర జాగ్రత్త: ఏఈ

సి.బెళగల్, జూలై 19: వ్యవసాయ బోరుబావులకు ఉండే విద్యుత్ మోటార్ల దగ్గర రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం విద్యుత్ ఏఈ సుమకుమార్ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందు వల్ల విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. స్తంభాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉందన్నారు.

నెలాఖరుకు అన్నక్యాంటీన్ల పనులు పూర్తి: కమిషనర్


పనులు పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: నగరంలోని అన్నీ అన్న క్యాంటీన్ల భవనాల మరమ్మతులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కల్లూరు ఎస్టేట్ సెట్కూరు కార్యా సమీపంలో, వైజంక్షన్ పరిమళనగర్, కలెక్టరేట్, ప్రభుత్వ ఆసుపత్రి, పాతబస్టాండ్‌ల్లో పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడ వద్దన్నారు. ఆయన వెంట ఎంఈలు షాకీర్, శేషసాయి, డీఈఈలు రవిప్ర కాష్‌నాయుడు, గిరిరాజు, రాజశేఖర్, ఏఈలు దినేష్, జనార్దన్, ప్రవీణ్‌కుమా ర్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మంత్రాలయం టీడీపీ నాయకుడు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 19: కలెక్టర్ కార్యాలయంలోని శుక్రవారం మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇది విద్యార్థి యువజన ప్రజా ప్రభుత్వం


నారా లోకేష్‌తో తెలుగునాడు విద్యార్థి సంఘం నాయకుడు రామాంజనేయులు

కర్నూలు(అర్బన్), జూలై 19: ఇది విద్యార్థి యువజన ప్రజా ప్రభుత్వమని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఉండవల్లిలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా విద్యార్థులు, యువత సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి చైతన్యపరిచామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివమూర్తి, బోయ తేజ, రమేష్, ముని నాయుడు, బెస్త జయసూర్య, బల్లెకల్లు సూర్య, గణేష్, తిమ్మరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: ఆదోని, ఎమ్మిగనూరులలో మొహర్రం వేడుకల్లో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రోజు రోజుకు దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, జూలై 19: మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ శుక్రవా రం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లు, బోర్లు, తాగునీటి కొళాయిల దగ్గర మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సర్పంచులకు ఆదేశించారు. ఏఈ వెంట సర్పంచులు ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రూ.6.11 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 19: ఈ సంవత్సరం వివిధ పథకాలతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యాన పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఉద్యాన వనరుల శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. రూ.6.11 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఎంఐడీహెచ్ కార్యాచరణ ప్రణాళికకు అనుమతి ఇచ్చిందన్నారు. కూరగాయలు, పూలతోటలు, పండు తదితర పంటలకు సంబంధించి 583 హెక్టార్లలో అభివృద్ధి చేసేందుకు 86.78 లక్షల సబ్సిడీని ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల నుంచి అభివృద్ధి చేసుకున్న తోటల మెయింటెనెన్స్ కోసం 10.21 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రక్షిత సాగు కింద క్యాప్సికం, కీరదోశ, చెర్రి, టమోట సాగుతో పాటు యాంటిబర్డ్ నెట్‌ల కోసం మల్చింగ్, తదితర పనులకు సంబంధించి రూ.27.45 లక్షలు విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజీలు ఉల్లిగోదాములు, ప్యాక్ హౌస్‌లు తదితర వాటి ఏర్పాట్లు కోసం రూ.2.83 కోట్లు, హార్టికల్చర్ కోసం రూ.12.30లక్షలు విడుదలైనట్లు తెలిపారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

గూడూరు, జూలై 19: ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సహాయ సంచాలకుడు వి. మల్లన్న అన్నారు. శుక్రవారం మల్లాపురంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గూడూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు శివకుమార్ ప్రారంభించారు. పెంచికలపాడు పశువైద్యాధికారి సునీల్‌కుమార్, మంజుల పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించాలి: డీసీపీ


మాట్లాడుతున్న డీసీపీ సంధ్యారాణి

కర్నూలు(న్యూసిటీ), జూలై 19: నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి కింగ్ మార్కెట్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణకు సహకరించాలని పట్టణ ప్రణాళిక డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి కోరారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోనున్న 89 మంది బాధితులతో ఆమె సమావేశమై వారి అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏసీపీలు రంగస్వామి, శశికళ, టీపీఎస్‌లు శభరీష్, మంజులమ్మ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

విద్యార్థులు మార్కులకే పరిమితం కావొద్దు


ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జూలై 19: విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని బాష్యం పాఠశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు విద్యార్థులను వారి అభిరుచులకు అనుగుణంగా ఎదిగేలా ప్రోత్సాహించాలని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి జీవితంలో సమాజానికి ఉపయోపడాలన్నారు. కార్యక్రమంలో బాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు హక్కు పత్రాల పంపిణీ

కల్లూరు, జూలై 19: కౌలు రైతులకు హక్కు పత్రాలను కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం బొల్లవరం గ్రామంలో సర్పంచు జయన్న ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులకు కావలసిన రాయితీ విత్తనాలను ప్రభుత్వమే అందిస్తుందని, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని ఏవో తెలిపారు. అదే విధం గా కౌలు రైతుల పండించిన పంటను కొనుగోలు చేయడం, పంటకాలంలో ప్రభుత్వం కరువును ప్రకటిస్తే అర్హులైన కౌలు రైతులకు పరిహారం అం దించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మద్దయ్య, విస్తరణ అధికారి సువర్ణ, చందన, రైతులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 19: జిల్లా డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 21న 14 సంవత్సరాలలోపు బాలికలకు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి నారాయణ తెలిపారు. 2012 సంవత్సరం లోపు జన్మించిన వారు అర్హులని, ఆధార్, జనన ధ్రువపత్రం, 5 ఫొటోలుతో ఎంపి కకు హాజరు కావాలని అన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 21, 22, 23, 23 తేదీల్లో తిరుపతిలో జరిగే సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు హాజ రు కావాలని, వివరాలకు 9441333280 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు, జూలై 19: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మనీషా (23) అనే మహిళ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మనీషా నాలుగేళ్ల క్రితం సోమిశెట్టి నగర్‌కు చెందిన సురేష్‌కుమార్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈమె సురేష్‌కు రెండో భార్య వీరిద్దరూ పెళ్లి కార్యక్రమాల్లో ఈవెంట్ మ్యూజిక్ డ్యాన్సర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల సురేష్ కుమార్ మరో మహిళతో చనువుగా ఉండటంతో ఈ విషయంపై భార్యాభర్తల మధ్య పలుసార్లు గొడవలు జరుగుతున్నాయి. భర్త ప్రవర్తనలో మార్పు రాక పోవడంతో మనీషా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు'


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సి.బెళగల్, జూలై 19: పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు. అనంతరం ఆమె బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. జ్వరాలు వస్తే వెంటనే పీహెచ్‌సీలను సంప్రదించాలన్నారు. ఆమె వెంట ఈవోఆర్డీ సందీప్, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో పాండురంగన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి

మద్దికెర, జూలై 19: మండలంలోని ప్రజలకు చౌకదుకాణాల ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించాలని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎండీయు వాహనాల యజమానులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలపైన వైసీపీ స్టిక్కర్లు ఉండకూడదన్నారు. బియ్యాన్ని లబ్ధిదారులకందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విచారణ జరపాలి

మద్దికెర, జూలై 19: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కడవల రవి కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో అలివేలమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వంశీ, హరి, శివ ఉన్నారు.

నిధులు విడుదల చేయండి

ఆదోని టౌన్, జూలై 19: పట్టణ పొలిమేరలలోని కొండలపై వెలసిన రణమండల ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, టూరిజం శాఖ జిల్లా అధికారి విజయను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కొండపైకి రోడ్డు వేయడానికి టూరిజం శాఖ ద్వారా రూ. రెండు కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఆదోనిలో ఆటో నగర్ ఏర్పాటుకు కృషి..


మంత్రి భరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదోని టౌన్, జూలై 19: ఆదోని పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే డా పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆయన మాట్టాడుతూ, ఆటోనగర్ అవశ్యకత గురించి కర్నూలులో జరిగిన జిల్లా పరిషత్ సమావేశం అనంతరం పరిశ్రమల శాఖామంత్రి టీజీ భారత్‌ను కలిసి వివరించానన్నారు. ఆటోనగర్ ఏర్పాటుతో వెయ్యికు పైగా కుటుంబాలకు ఉపాధి లభించడమే కాకుండా, పట్టణాభివృద్ధికి అవకాశం ఉందన్నారు.

సీజనల్ వ్యాధులపై అజాగ్రత్త వద్దు


బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

కౌతాళం, జూలై 19: సీజనల్ వ్యాధులపై ప్రజలు అజాగ్రత్తగా ఉండరాదని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో రఘునాథ గుప్తలు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై చేపడుతున్న పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, కాచిన నీటినే తాగాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, యోగేశ్వరరెడ్డిలు ఉన్నారు.

రూ.50 వేల మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం

మంత్రాలయం, జూలై 19: మంత్రాలయం ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎంజీ చారిటీస్ సభ్యులు మాచాని రమేష్, మాచాని సోమనాథ్, మాచాని గంగాధర్, తారకేశ్ రూ.50వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయులు అంపయ్య విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోట్ల చంద్రశేకర్, విఠోభ రావు, రామన్న, నరసింహ రాజు, బసవరాజు, గోపాల్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 19: ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న అన్నారు. శుక్రవారం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని రెండు ఆసుపత్రులను ఆధునీకరించారని, దానివల్ల వందలాదిమంది రోగులు డివిజన్ నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా వైద్యం కోసం వస్తున్నారన్నారు. అక్కడ పని చేస్తున్న కార్మికులకు కనీసం ఫినాయిల్, సర్ఫు నాసిరకమైనటువంటి పరికరాలు అందిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ యూనిఫాం కూడా అందివ్వలేదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్, హుసేని, సోమన్న, చిన్న హైమావతి, నాగమ్మ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న డీఎస్పీ

పత్తికొండ, జూలై 19: దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబానికి పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం రూ. 1,26,000 ఆర్థికసాయాన్ని అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ మే 28న శ్రీనివాసులు మృతి చెందాడని, ఆయన కుటుంబానికి కర్నూలు, నంద్యాల పోలీస్‌సిబ్బంది, హోంగార్డులు కలిసి ఈ ఆర్థిక సాయం అందించారని డీఎస్పీ తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం: ఆర్డీవో

ఆలూరు, జూలై 19: ఎన్నికల కోడ్ కారణంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే దరఖాస్తు చేసుకున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆలూరుకు వచ్చిన ఆమెను జర్నలిస్టులు కలిశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు స్వరూప్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఆయా మండలాల్లో అనువైన స్థలాలు చూపించాలన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన విలేఖర్లకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేలా చూస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి చంద్రబాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రాజేష్, మండల అధక్ష కార్యదర్శులు అట్టికల్ గోపాల్, వీరేశ్, గోపాల్, సభ్యులు సాహెబ్ జాన్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

పత్తికొండ టౌన్, జూలై 19: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని, ఇలాంటి సమయంలో విద్యుత్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ నారాయణ స్వామి ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులు తీసుకోవల్సిన భద్రతా సూచనలను ఆయన వివరించారు. పట్టణ, గ్రామాల్లో ఎక్కడైనా ఇనుప కరెంటు పోల్స్ ఉంటే.. వాటికి దూరంగా ఉండాలని, అలాగే సర్వీసు వైర్లు తెగిపడితే.. ఇంట్లో షాట్ సర్క్యూట్ అయిన సమయాల్లో తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలి

- మినీ ట్యాంకు ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే బీవీ


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, జూలై 19: పట్టణంలో తాగునీటి సరఫరాపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని బోడ్డురాయి వీధిలో తాగునీటిలో పురుగులు వస్తున్నాయని ఎమ్మెల్యేకు ఫిర్యాదు రావడంతో వెంటనే ఆప్రాంతంలో ఎమ్మెల్యే బీవీ పర్యటించారు. తాగునీటిలో పురుగులు వస్తున్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక మంచినీటి కుళాయిల నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. పలువురు మహిళలు మా ప్రాంతంలో తాగునీరు సరిగా రావటం లేదని, వచ్చినా కొద్దిసేపు మాత్రమే వస్తున్నాయని, మురుగు కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదని, దీంతో దుర్వాసనతో ఇంటి బయట కూర్చోలేక పోతున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు. అలాగే వీధి చివరలో కొండపై ఉన్న నివాసం ఉంటున్న నివాస గృహాలను పరిశీలించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో ఒక మిని ట్యాంకును ఏర్పాటు చేస్తామని, ఇందుకు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, ఎక్కడైతే నీటి సరఫరా లేదో గుర్తించి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా మినీ ట్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట డీఈ మనోహర్ రెడ్డి, టీడీపీ నాయకులు మిఠాయి నరసింహులు, రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

జనసేన పార్టీని బలోపేతం చేస్తాం

జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప


మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, జూలై 19: నియోజకవర్గంలో జనసేనను బలోపేతం చేస్తామని ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ అవినీతి మొత్తం వెలుగులోకి వచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం పరిపాలన విధానంలో మార్పులు చేస్తున్నారన్నారు. తాగునీటి సమస్య, రహదారి సమస్యలను పరిస్కారం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఆలూరులో ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోని షాపింగ్ కాంప్లెక్సులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జనసేన ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, నాయకులు చత్రపతి, అరవింద్, చంద్ర, వీరేష్ అశోక్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఉచ్చిరప్ప, ఎక్స్ ఆర్మీ రామాంజనేయులు, జగదీష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూస్తాం

● పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి


ఆలూరు గోదాము పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి

ఆలూరు, జూలై 19: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు.. శుక్రవారం ఆలూరు సివిల్ సప్లై గోదామును ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రేషన్ షాపు లకు సరఫరా అయ్యే బియ్యంలో ప్రతి బ్యాగ్‌లో 2,3 కేజీలు తగ్గుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.. ముఖ్యంగా ప్రజలు ప్రతి నెల రేషన్ షాప్‌కు వెళ్లి నిత్యావసరాలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు పాఠశాలలు, హాస్టల్స్ తనిఖీలు చేయాలన్నారు. తాగు నీరు కలుషితం అవ్వకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు.. ఆమె వెంట తహసీల్దార్ చంద్ర శేఖర్, ఆర్ఐ బసవన్న గౌడ్, గోదాం ఇన్‌చార్జి రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి బిల్లును చెల్లించాలి

ఆదోని రూరల్, జూలై 19 : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను కూలీలకు చెల్లించాలని, బోరు బావుల మోటార్లకు మీటర్లను బిగించడం రద్దు చేయాలని సీపీఎం నాయకులు లింగన్న, తిక్కప్ప, వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సచివాలయాన్ని ముట్టడించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

గోవుల అక్రమ రవాణా

ఆదోని రూరల్, జూలై 19 : కోళబరాలకు గోవులను అక్రమంగా రెండు వాహనాల్లో తరలిస్తుండగా హిందూ సంఘాల నాయకులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. శుక్రవారం విరాట్ హిందూ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశోక్ కుమార్ మాట్లాడుతూ ఆలూరు మండలం మూసానుపల్లె గ్రామానికి చెందిన పలువురు అదే గ్రామంలోని సోమలింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన గోవులను కోళబరాలకు విక్రయించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ దేవాలయానికి సంబంధించి వంద ఎకరాల భూమి ఉందని, ఆ దేవాలయానికి దాతలు ఆవులను ఇస్తే, భూమిని సాగు చేసేవారు ఆ ఆవులను పెంచి పోషించకుండా కోళబరాలకు తరలించడం అన్యాయమని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థి బస్సు వచ్చేస్తోంది


మర్లమడి విద్యార్థులతో మాట్లాడుతున్నా ఆదోని డిపో మేనేజర్

హొళగుంద, జూలై 19: మండలంలోని మర్లమాడికి గ్రామానికి విద్యార్థి బస్సును ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి హొళగుందకు 5 కిలోమీటర్లు దూరం నుంచి నడిచి జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఈనెల 15వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన శీర్షికకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. అయిన ఆదేశాల మేరకు ఏపీఎస్‌ఆర్‌టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ గ్రామాన్ని శుక్రవారం సందర్శించి రూట్ మ్యాప్ పరిశీలించినట్లు తెలిపారు. శనివారం నుంచి విద్యార్థి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఎంఆర్‌పీఎస్, ఏఐఎస్ఎఫ్ ధన్యవాదాలు తెలిపారు, కార్యక్రమలో గ్రామస్థులు మంగయ్య, శేఖర్, మల్లికార్జున, వీరేష్, గర్జప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై శ్రద్ధ పెట్టాలి

రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ కల్పన శైల

ఆదోని (అగ్రికల్చర్), జూలై 19: భవిత కేంద్రాల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ కల్పనా శైల అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలోని తిరుమలనగర్ భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. ప్రభుత్వం వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. ఫిజియోథెరపీ వైద్యుడిని జిల్లా అధికారులు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష విక్టోరియల్ ఆఫీసర్ సురేష్, ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే పునాది


మాట్లాడుతున్న కల్పనశైల

మంత్రాలయం, జూలై 19: ప్రాథమిక పాఠశాల విద్య పునాది వంటిదని, ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చి క్రమశిక్షణగా చదువుకోవాలని రాష్ట్ర పరిశీలకురాలు కల్పనా శైల అన్నారు. శుక్రవారం మంత్రాలయం రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కిట్లు, ఐఎల్ఎం విద్యార్థులు, తరగతి గదుల్లో విద్యాబోధన అమలు వంటి అంశాలపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిదని అన్నారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు దీనికి పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ తనిఖీలో ఎంఈవోలు ఫైనుద్దీన్, రాగన్న, సీఆర్పీలు నర్సన్నగౌడు, బంగారప్ప, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్ణయాలతో విద్యారంగానికి నష్టం

మంత్రాలయం, జూలై 19: అప్పటి వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో జీవోల విడుదల వల్ల విద్యారంగం నిర్వీర్యమైందని, ఇప్పటి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మంత్రాలయం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, వీరేశ్, నాగభూషణం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల గత ప్రభుత్వం తప్పు చేసిందని అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 - 5 తరగతులను కొనసాగించే విధంగా ఇప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్టీయు నాయకులు శ్రీనివాసులు, రవీంద్రలాల్, రామకృష్ణ, భీమన్న, పాణేశ్ ఆచార్, నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


రామ్‌నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో అలివేలమ్మ

మద్దికెర, జూలై 19: స్థానిక రామ్‌నగర్ కాలనీలో మురుగునీటిని బయటకు వదిలిన వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో మురుగునీటిలోనే తాగునీటి కొళాయి అనే వార్తకు స్పందించిన ఎంపీడీవో కొళాయి పరిసర ప్రాంతాల్లో నీటిని బయటకు వదిలిన వారికి నోటీసులు జారీ చేశారు. అలాగే ఎక్సవేటర్ ద్వారా పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఎంపీడీవో ఏవో స్వర్ణలత, పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్ తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా

తుగ్గలి, జూలై 19: మండలంలోని రామకొండ సచివాలయం ఉద్యోగులు శుక్రవారం విధులకు హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు సచివాలయంలో ఎవరూ లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. సచివాలయానికి హెల్త్ కార్యదర్శి మాత్రమే హాజరయ్యారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా.. రామకొండ సచివాలయంలో విచారణ చేసి సంతకాలు చేసి ఇంటికి వెళ్లిన అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అతిసార నివారణకు కృషి చేయండి


కలెక్టర్ రంజిత్‌బాషాను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూలై 19: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార నివారణకు కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషాను మంత్రాలయం టీడీపీ నాయకుడు ఎన్. రాఘవేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి కర్నూలులో కలెక్టర్‌ను కలిసి పూలబొకే అందజేసి శాలువతో సన్మానించారు. మంత్రాలయం నియోజకవర్గంలో రోడ్లు, తాగునీటి సమస్య అధికంగా ఉన్నాయని, మంత్రాలయం అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈయన వెంట టీడీపీ రాకేష్ రెడ్డి ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు, జూలై 19: కర్నూలు ఎస్పీగా నియమితులైన బిందు మాదవ్‌ను శుక్రవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కర్నూలులోని ఎస్పీ కార్యాలయంలో కలిశారు. ఎస్పీకి పూలగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చిప్పగిరి ఎంపీపీ వాహనం ధ్వంసం

● గుంతకల్ పోలీసులకు ఫిర్యాదు

చిప్పగిరి, జూలై 19: చిప్పగిరి ఎంపీపీ జూటూరు హేమలత వాహనాన్ని బుధవారం రాత్రి కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయంపై గుంతకల్ రెండో పట్టణ పోలీసులకు ఎంపీపీ హేమలత అమె భర్త మారయ్య ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఎంపీపీ హేమలత ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనపై అరా తీశారు. పోలీసులు విచారణ జరిపి వాహనం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు పందికోన రిజర్వాయర్ చేపల వేలం

పత్తికొండ, జూలై 19: పత్తికొండ మండల పరిధిలోని పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి శనివారం వేలాలు నిర్వహించనున్నట్లు గాజులదిన్నె మత్స్యశాఖ అధికారి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... 2024 సెప్టెంబర్1వతేదీ నుండి 2025 జూన్30వ తేదీ వరకు మొత్తం 10నెలలపాటు రిజర్వాయర్‌లో చేపలపెంపకం, చేపలు పట్టడానికి వేలాలు నిర్వహిస్తున్నామన్నారు. పత్తికొండ మండల పరిషత్ సమావేశభవనంలో ఉదయం 11గంటలకు వేలం ప్రారంభిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు తమ ఆధార్‌కార్డుతోపాటు రూ10 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సోమిశెట్టి


మంత్రాలయంలో ప్రదక్షిణలు చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, జూలై 19: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ కమిటీ సభ్యులు చిత్త రంజన్‌దాస్, విజయ్ కాలిన్ మెహంతాలు వేర్వేరు సమయాల్లో మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం వీరికి మఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు వీరికి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, వ్యాసరాజాచార్, బిందుమాధవ్, టీడీపీ నాయకులు నరసింహ, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ అమర్నాథ్ రెడ్డి, ఏపీవో తిమ్మారెడ్డి, ఈసి శ్రీనివాసులు, టీఏ రఘువీర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జూలై 19: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన గంగాధర్ రెడ్డి అనేభక్తుడు రూ.లక్ష అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందించాలి


కోసిగిలో ఎల్లెల్సీ ఏఈ రాజేష్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోసిగి, జూలై 19: మండలంలోని ఎల్లెల్సీ పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందించాలని, అంతకంటే ముందు ఎల్లెల్సీ కాలువలో పూడిక తీత పనులు, ముళ్లకంప చెట్లను తొలగించాలని ఎల్లెల్సీ ఏఈ రాజేష్‌కు టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగిలోని ఎల్లెల్సీ కార్యాలయంలో ముత్తురెడ్డి ఏఈ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, జక్కనగేని వెంకటేశ్వర్లు, నాడిగేని చిన్న తాయన్న, వీరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో దోమల నియంత్రణ చర్యలు

ఆలూరు, జూలై 19: ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో దోమలు నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్రావు తెలిపారు... శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో దోమల నియంత్రణకు స్ప్రే చేసి పరిసరాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.. విద్యార్థులు కూడా రాత్రి పడుకునే సమయంలో దోమ తెరలు వాడాలన్నారు.. కార్యక్రమంలో వార్డెన్ సుధారాణి, డాక్టర్, శేఖర్, ఆదోని మలేరియా యూనిట్ ఆఫీసర్ మంజునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం ఉన్నారు.

బాధితులకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఆదోని టౌన్, జూలై 19: నాగనాతన హళ్లి గ్రామంలో హత్యకు గురైన గుండమ్మ కుటుంబ సభ్యులను రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబు రావు, మాజీ మంత్రి మారెప్ప శుక్రవారం పరామర్శించారు. గత ప్రభుత్వంలో ఎస్సీల పైనే ఎక్కువ దాడులు జరిగాయని, ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండు నెలలు కూడా కాకముందే హత్యా రాజకీయాలు ఎక్కువైయ్యాయని విమర్శించారు. గుండమ్మ కుటుంబంపై అగ్రవర్ణాల దాడి జరిగితే అంతవరకూ ప్రభుత్వం స్పందించలేదన్నారు. వెంటనే బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించాలి: ఎమ్మెల్యే

ఆలూరు, జూలై 19: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే మండలంలో ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించాలని జిల్లా పరిషత్ సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషాను కోరినట్లు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలూరు పట్టణంలో 18 రోజులకు ఒక్కసారి తాగు నీరు సరఫర అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఈ విషయంలో జాప్యం వహిస్తున్నట్లు స్పష్టం అవుతుందన్నారు. నీటి సరఫరాలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచ్, వాటర్మ్యాన్ల మధ్య సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని అన్నారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయాలి

తుగ్గలి, జూలై 19: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడల రవికుమార్, సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 66 పాఠశాలలో 7వేలకు మందిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. మండలంలో ఏపీ మోడల్ పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

మానసిక వికలాంగులకు చేయూతనిస్తాం


ఎమ్మిగనూరు, జూలై 19: మానసిక వికలాంగులైన చిన్నారులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందిస్తామని రోటరీ క్లబ్ సభ్యులు, రిటైర్డ్ ఆర్‌టీఓ కేఆర్ నరసింహారెడ్డి, యోగా గురువులు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న మానసిక విద్యార్థుల సదనంలో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు నటరాజ్ రెడ్డి, సుధాకర్ రావు, సభ్యులు షఫీవుల్లా, మాచాని శివకుమార్, బీరప్ప, శ్రీనాథ్‌రెడ్డి, మహానందయ్య శెట్టి, మాచాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ నర్సరీని పరిశీలించిన కేంద్ర బృందం


బనవాసిలో సెంట్రల్ నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎమ్మిగనూరు, జూలై 19: బనవాసి ఫారంలో ఉన్న సెంట్రల్ నర్సరిని, కేవీకేలను శుక్రవారం కేంద్ర బృందం అధికారి ఐఆర్ఎస్ చిత్తరంజన్ దాస్, కేతన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో జలశక్తి అభియాన్ కింద జరుగుతున్న నీటి సంరక్షణ పనులు ఎలా జరుగుతున్నాయి, నర్సరీలో మొక్కల పెంపకాలను, కృషివిజ్ఞానకేంద్రలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. వీరి వెంట పీడీ అమర్‌నాథ్ రెడ్డి, ఏపీడీ అలీపీరన్, ఏపీఓలు, ఈసీలు పాల్గొన్నారు.

'గుమ్మనూరు నాపై పోటీ చేయాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, జూలై 19: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం దమ్ముంటే మంత్రాలయంలో తనపై పోటీ చేయాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం మండలంలోని రాంపురం రామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో వైసీపీ మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆలంపూరులో జరిగిన బీసీ గర్జనలో రాంపురంరెడ్డి సోదరుల్లో ఇద్దరిని ఓడించామని, బాలనాగిరెడ్డి ఒక్కడే మిగిలిపోయాడని ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, సీవీ విశ్వనాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, అడ్వకేట్ గురురాజరావు, రోగెప్ప, మల్లికార్జున, తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, వీరారెడ్డి, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.